www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 5 ఏప్రిల్ 2023

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా

సర్వం సిద్ధం చేసిన టిటిడి, జిల్లా యంత్రాంగం

నేడు సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట విద్యుత్ దీపాలతో ఆకాశమంత పందిరితో కళకళలాడుతోంది. ఇప్పటికే రాష్ట్ర నలుమూల నుంచి స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు యాత్రికులు ఒంటిమిట్ట చేరుకున్నారు. కల్యాణశోభను ఒంటిమిట్ట సంతరించుకుంది. రామనామ స్మరణతో ఏకశిలానగరం మారుమోగుతోంది. విపరీత రాక, పోలీసుల బందోబస్తుతో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు నూతన శోభను సంతరించుకుంది. ఏకశిలానగరిలో బుధవారం రాత్రి నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి టిటిడి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట కోదండ రామాలయం విద్యుత్ దీపపు ధగధగలతో దేదీప్యమానంగా ముస్తాబైంది. నభూతో నభవిష్యతి అనేరీతిలో విద్యుత్ కాంతుల మధ్య ఆకాశమంత చలువపందిళ్లతో కళకళ లాడుతోంది. రాష్ట్రం నలు మూలల నుంచి జగదభిరాముని కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు, యాత్రికులు, సేవకులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. జగదభిరాముని ఆలయంలోని ధ్వజమండపం, ధ్వజస్తంభం, కల్యాణవేదిక విద్యుత్ కాంతులతో కల్యాణశోభను సంతరించుకుంది. ప్రభుత్వం తరుపున కల్యాణోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో రానుండడంతో నూతనశోభ చోటు చేసుకుంది. పలువురు మంత్రులు, వివిఐపిలు రానున్నారు. సుమారు రెండు వేల మంది పోలీసులు అడుగడుగునా మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజునాటికి కల్యాణ ఘడియలు సమీపించడంతో పలువురు భక్తులు, పర్యాటకులు, యాత్రికులు, సేవకులు కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు ఎదురు చూస్తున్నారు. ఒంటిమిట్ట గ్రామ శివారులోని కల్యాణ వేదిక, దత్తమండపం, కోదండ రామాలయం విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ప్రకాశిస్తోంది. ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అడుగడుగునా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గతానికి భిన్నంగా భారీఎత్తున ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని జయప్రదం చేయడానికి పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లను చేయడం గమనార్హం. బుధవారం రాత్రి చంద్రుని వెన్నెల్లో జరిగే కల్యాణోత్సవానికి పలువురు దాతలు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సీతారాముల కల్యాణం అనంతరం టిటిడి యంత్రాంగం లక్షలాది మందికి భోజన సదుపాయాలను ఏర్పాటు చేసింది.

రాములోరి కల్యాణోత్సవానికి ముస్తాబైన వేదిక

గరుడ వాహనంపై సీతాపతి

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాహన సేవ 9 గంటల వరకు జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం మోహినీ అలంకారంలో రాములవారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎఇఒ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్వీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు సమర్పణ

బుధవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను మంగళవారం సమర్పించారు. 180 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో అందించారు. ఈ తలంబ్రాల కోసం ఆరు నెలల పాటు వరి ప్రత్యేకంగా పండించి నాలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో మూడు నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా భద్రాద్రి రామునికి, ఆరేళ్లుగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని కళ్యాణ అప్పారావు తెలిపారు.


గరుడవాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు

భూపరిహారం వెంటనే పంపిణీ చేయాలి

- జెసి తమీమ్ అన్సారీయా

ప్రజాశక్తి -రాయచోటి

మదనపల్లి-పీలేరు జాతీయ రహదారి-71కు సంబంధించి త్వరితగతిన భూపరిహారం పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మదనపల్లి నుంచి పీలేరు వరకు చేపట్టిన జాతీయ రహదారి-71 కు సంబంధించి భూ పరిహార పంపిణీ అంశంపై జాతీయ రహదారి అధికారులు, సంబంధిత తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మదనపల్లి నుంచి పీలేరు వరకు చేపట్టిన జాతీయ రహదారికి అవసరమైన 455 ఎకరాలను 2018-19 లో సేకరించామని చెప్పారు. ప్రస్తుతం భూ పరిహార పంపిణీ చేస్తున్నారని, ఇందులో భాగంగా ఇప్పటికే 82 శాతం పరిహారం చెల్లించామని పేర్కొన్నారు. రహదారికి సంబంధించి అవసరమై ఈ సంవత్సరం అదనంగా మరో 104 ఎకరాలు సేకరించగా అందులో కూడా 35శాతం పరిహారం చెల్లించారని తెలిపారు. ఈ రెండు అంశాలలో మిగిలిన పరిహారాన్ని కూడా వేగవంతంగా చెల్లించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పరిహారం చెల్లింపుకు సంబంధించి తహశీల్దార్ల వద్ద ఫైల్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ కలెక్టరేట్‌కు పంపించాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉన్నప్పుడు ఉన్న వాస్తవ అంశాలపై పూర్తిగా సమాచారాన్ని క్రోడీకరించి ఫైల్స్ పంపాల్సి ఉందని తెలిపారు. కోర్టు కేసులకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలన్నారు సమావేశంలో జాతీయ రహదారుల అథారిటీ సైట్ ఇంజినీర్ వెంకటరమణ, సంబంధిత తాసిల్దార్లు, జాతీయ రహదారుల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సిజిఆర్ టాలెంట్ మీట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాట్లాడుతున్న డైరెక్టర్ సురేష్‌బాబు

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల రాజంపేటలో సిజిఆర్ టాలెంట్ మీట్ మంగళవారం ఘనంగా ముసిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టియు అకాడమిక్ ఆడిట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ఎ.ఏ.సురేష్ బాబు పాల్గొని మాట్లాడారు. మొదటగా సాఫ్ట్ వేర్ ఉద్యోగికి కావాల్సిన ప్రాథమిక లక్షణాలు గురించి వివరించారు. ప్రతి ఒక నూతన టెక్నాలజీపై కనీస అవగాహన ఉండటంతోపాటు, కనీసం ఒకటి, రెండు టెక్నాలజీలపై పట్టు ఉండాలన్నారు. ప్రతి ఒక సమస్యకు అనేక రకాల పరిష్కార మార్గాలను అన్వేషించేలా ఉండాలని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి. నారాయణ మాట్లాడుతూ సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కార మార్గాలు దొరికినంత వరకు నిరుత్సాహపడకుండా ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుతం సిఎస్ఇ, ఎంసిఎ, ఎఐఎంఎల్, ఎఐడిఎస్, ఎంబిఎ విభాగాలకు పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ప్రజెంటేషన్ నిర్వహించామని చెప్పారు. కార్యక్రమాలకు ఇతర కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఈఈఈ, మెకానికల్, సివిల్, ఈసిఈ విభాగాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకాడమిక్ డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు, డాక్టర్ ఫణీంద్ర కుమార్‌రెడ్డి, డాక్టర్ టి.హరికృష్ణ, ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ సి.మదన్ కుమార్ రెడ్డి, డాక్టర్ పి.సుబ్రమణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న జెసి తమీమ్ అన్సారీయా

నూతనోత్తేజంతో పనిచేయండి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

నూతనోత్తేజంతో ఇంకా బాగా పని చేయాలని వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. జిల్లా ఏర్పాటై ఏడాది పూర్తి కావడంతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి ఆమె కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడిన తరువాత ప్రథమ కలెక్టర్ గిరీష పి.ఎస్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధికి వివిధ శాఖల అధికారులు బాగా కృషి చేశారని, ఇలాగే రెట్టింపు ఉత్సాహంతో మనమందరం కలిసికట్టుగా పనిచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి తోడ్పడదామని ఆమె పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన జిల్లా బాలారిష్టాలు అన్ని దాటుకొని అన్నమయ్య జిల్లాలో సిబ్బంది అందరూ బాగా పని చేశారని, జిల్లాలో మంచి అధికారుల బృందం కలదని కితాబు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందేలా చూడడంతో పాటు వారి సంక్షేమ అభివృద్ధికి తోడ్పాటు ఇద్దామన్నారు. రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు అందరం కష్టపడి పని చేద్దామన్నారు. వేడుకలలో కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, విఎస్ డబ్ల్యూ ఎస్ఎఒ మనోహర్ రాజు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఓ సిహెచ్ పురుషోత్తం, సమాచార శాఖ పిఆర్ఒ, కలెక్టరేట్ సూపరెండెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా మొదటి వసంత వేడుకలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా ఆవిర్భవించి మంగళవారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎంఎల్ఎ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి వైఎస్ఆర్ సిపి శ్రేణులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష,వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్,వ వార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్ సిపి జిల్లా మైనారిటీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, కౌన్సిలర్లు , వైఎస్ఆర్ సిపి నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా పరిపాలనను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి నూతన జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి వారు తీసుకొచ్చారని చెప్పారు. కొత్త జిల్లాలో ప్రగతి, పురోగతి సాధ్యమైందన్నారు. జిల్లా నలుమూలల నుంచి రాయచోటికి వచ్చి సులువుగా జిల్లా అధికారులును కలసి ప్రజలు తమ సమస్యలును పరిష్కరించుకుంటుండడం హర్షణీయమన్నారు. జిల్లా కేంద్ర మైన రాయచోటి అభివృద్ధికి ఎంఎల్ఎ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి కృషి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాయచోటి పట్టణం ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి సారథ్యంలో ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌడ్ ఖాన్, సుగవాసి శ్యామ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, జయన్న నాయక్, భాస్కర్, అన్నా సలీం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ విజయ భాస్కర్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, నాయకులు రియాజుర్ రెహమాన్, హసన్ బాష, మాజీ కో ఆప్షన్ జాఫర్ అలీ ఖాన్, మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, కొత్తిమీర ప్రసాద్, మూసా, అజ్మతుల్లా ఖాన్, కొత్తపల్లె ఇంతియాజ్,నాగేశ్వర, బిసి నాయకుడు శ్రీనివాసులు, జావీద్, అమీర్ పాల్గొన్నారు.

హంసవాహనంపై విహరించిన రామచంద్రుడు

- ముగిసిన పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు
- కోలాహలంగా వసంతోత్సవం
- భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ముగ్ధమనోహర రామచంద్రుడు హంసవాహనాన్ని అధిరోహించి, భక్తులను కటాక్షించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు స్వామివారికి వసంతోత్సవం నిర్వహించి, తిరుమాడవీధుల్లో విహరింపజేస్తూ కోలాహలంగా భక్తులు వసంతోత్సవం జరుపుకున్నారు. సీతారామలక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముగ్ధమనోహరంగా అలంకరించిన దేవదేవుడిని రాత్రి 8గంటలకు హంసవాహనంపై అధిష్టింపజేసి తిరుమాడవీధుల్లో ఊరేగించారు.

హంసవాహనంపై విహరిస్తున్న రామచంద్రుడు

మహిళలు నేతిదీపాలతో స్వాగతం పలుకుతూ కర్పూరహారతులు ఇచ్చి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రి 10 గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ధ్వజావరోహణ కార్యక్రమంతో శ్రీ పట్టాభిరాముడి శోభకృత్ నామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గురుమూర్తి, సిబ్బంది దుశంత్, నాగరాజ, భక్తులు, రామభక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ ఛాంపియన్‌గా 'శ్రీచైతన్య' విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో వరుసగా పదవసారి ప్రపంచ ఛాంపియన్‌గా శ్రీ చైతన్య పాఠశాల నిలిచి చరిత్ర సృష్టించిందని ఆర్ఎస్ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఛాంపియన్‌గా నిలిచిన సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ కాంటెస్ట్‌లో ప్రపంచ నలుమూలల నుండి 30 పైగా దేశాలు పాల్గొనగా భారత దేశాన్ని మొదటి స్థానంలో నిలిపిన ఘనత శ్రీ చైతన్య దేనని అన్నారు. నాసా వారి ఎన్ఎస్ఎస్ కాంటెస్ట్ లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టులలో 89 ప్రాజెక్టులు భారత్ నుంచి ఎంపికవ్వగా అందులో 54 ప్రాజెక్టులు ఒక శ్రీ చైతన్య పాఠశాలవి ఉన్నాయన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుండి 18 ప్రాజెక్టులుండగా కడప జోన్ నుండి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో బహుమతులు సాధించడంలో తమ పాఠశాల విద్యార్థులు ముందంజలో ఉన్నారన్నారు. భారతదేశంతో ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందానికి శ్రీ చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ బి.ఎస్.రావు, డైరెక్టర్ సీమ, ఏజిఎం రమణయ్య ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, కో ఆర్డినేటర్ కుటుంబరావు, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సౌజన్యంతో జిల్లా కేంద్రమైన తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈనెల 9, 10 తేదీలలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు రాజంపేటకు చెందిన ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, మల్లెల హైమవతి, యూపీ రాయుడును ఆహ్వానించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవాధ్యక్షులు చేజర్ల ఇంద్ర కుమార్ రాజు, చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రపంచ సాహితీ, కళా చరిత్రలో రికార్డు నెలకొల్పుటకై 48 గంటలపాటు ప్రపంచ కవితోత్సవం, సాహితీ సదస్సులు, కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు జరుగనున్నాయి. ఈ మేరకు శ్రీశ్రీ కళా వేదిక కన్వీనర్ కొల్లి రమావతి, ప్రోగ్రాం కన్వీనర్ గుత్తా హరిసర్వోత్తమ నాయుడులు నుంచి తమకు ఆహ్వానం అందినట్లు తెలిపారు.

వాలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వార్డు వాలంటీర్ అభ్యర్థులకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు ఆన్‌లైన్‌లో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మున్సిపల్ మేనేజర్ రాధా, ఆర్ఒ పెంచలయ్య , ఆర్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలు 20 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 19 మంది హాజరయ్యారు. వారి సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించి ఎంపికైన వారికి త్వరలో నియామక పత్రాలు అందిస్తామన్నారు.

నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రాయచోటి

డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలను పండుగ వాతావరణంలో బుధవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష పి.ఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ఉదయం 10.00 గంటలకు ఈ వేడుకలను నిర్వహిస్తామన్నారు. జిల్లాలో గల ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘ నాయకులు, జిల్లా అధికారులు, అనధికారులు, ప్రజలు అందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఎడి ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'పరీక్షల నిర్వహణలో అధికారుల విఫలం'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో అధికారులు విఫలం చెందారని ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడి ప్రసాద్ బాబుకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి, ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయికుమార్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామన్న విద్యాశాఖ అధికారులు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటనలకు మాత్రమే పరిమితం అయ్యారని అన్నారు. నోటి మాట తప్ప ఎక్కడా ఆచరణలో మాత్రం శూన్యమన్నారు. రాయచోటి మాసాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి ఒఎంఆర్ షీట్ బయటకు తీసుకెళ్లి కాల్చి వేయడం అంటే అక్కడ ఉన్నటువంటి ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ ఏం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పరీక్షల పైన అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పారు. కోడూరు, రాజంపేట మదనపల్లి రాయచోటి పట్టణాల్లో తక్షణమే పరీక్ష కేంద్రాల వద్ద ప్రయివేట్ ఉపాధ్యాయులు, ప్రయివేట్‌స్కూల్ యాజమాన్యాలు, ఉపాధ్యాయులు లేకుండా చేయాలని ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్ గా డిమాండ్ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థులు వడదెబ్బ లాంటి ప్రభావం జరిగే పరిస్థితులు ఉన్నాయన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పనివేళలు మార్పు

ప్రజాశక్తి రాయచోటి

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వుల మేరకు ఎండ తీవ్రత దృష్ట్యా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 4 నుంచి మే 31 వరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. కార్యకర్తలు గమనించాలన్నారు. మే 1 నుంచి 15 వరకు అంగన్వాడి కార్యకర్తలకు, మే 16 నుంచి 31 తేదీ వరకు ఆయాలకు సెలవులు మంజూరు చేశామన్నారు.

ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని మదనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సానిక మల్లికార్జున సర్కిల్‌లోని ఎన్‌జిఒ హోమ్ వద్ద ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు క్లబ్ సభ్యులు సాయి శేఖర్ రెడ్డి, రాజా, సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి మంగళవారం డయాబెటిక్ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ప్రస్తుత కాలంలో మధుమేహ వ్యాధి అధికతమవుతున్ననేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరిసర ప్రాంత ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎయిర్టెల్ సుధాకర్ రెడ్డి , విజయ్ కుమార్ రెడ్డి, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ఒ మల్లిక

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖబేగం ఆదేశాల మేరకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిహెచ్ఒ మల్లికా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని అన్నారు. గర్భిణులను గుర్తించి, రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలన్నారు. తల్లి బిడ్డలకు అందించే వైద్య సేవల వివరాలను ఎప్పటికప్పుడు ఎంసిపి రిజిస్టర్‌లో ఆర్‌సిహెచ్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా టీకాలను వేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురుగునీటి నిల్వలు లేకుండా, దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మల్లిక, ఎంపిహెచ్ఇఒ రామచంద్ర, పిహెచ్ఎన్ సరోజ, సూపర్వైజర్ దేవ కుమారి, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతిని అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ప్రజా రాజధాని అమరావతి రైతుల సుదీర్ఘ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని, సిఎం జగన్మోహన్ రెడ్డి ఇకనైనా తన మనసు మార్చుకుని మూడు ముక్కలాటకు స్వస్తి పలికాలని టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్ సూచించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వైసిపి ప్రభుత్వ వైఖరిని తప్పు పట్టారు. మూడు రాజధానుల పేరిట ప్రజలను గందరగోళంలో నెట్టివేసిన సిఎం మూడు ముక్కలాటకు తెరదించాలని సూచించారు. ప్రజలు అమరావతి రాజధానిగా ఆమోదిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మూడు ప్రాంతాల నుండి టిడిపి సభ్యులను గెలిపించారని వివరించారు. ఇప్పటికైన సిఎం జగన్ మనసు మార్చుకుని ప్రజా రాజధాని అమరావతిని రాష్ట్ర రాజధానిగా పూర్తి స్థాయి అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో సుధాకర్, శ్రీరాములు, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

వాహనదారుల నుంచి ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. కడప-చెన్నై బైపాస్ రోడ్డులో గల అప్పయ్య రాజుపేట వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు లేనివారు హెల్మెట్లు ధరించని వారు వాహన చోదకులను గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతూ మృతి చెందుతున్న విషయం గుర్తించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేని ప్రయాణం నేరమని, వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ కళావతి

రైతుల సహకారంతో సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని కన్యమడుగు రెవెన్యూ గ్రామపంచాయతీ రైతుల సహకారం అభినందనీయమని తహశీల్దార్ కళావతి తెలిపారు. మంగళవారం గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా సమగ్ర భూ సర్వే కన్యమడుగులో జరగడం హర్షనీయమన్నారు. ఈ సర్వేకు సహకరించిన రైతులు భూములకు హద్దులు ఏర్పాటు చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో సమగ్ర భూ సర్వే పూర్తి చేసి రైతుల భూములకు హద్దురాళ్ళు ఏర్పాటు చేయడం చేస్తామని చెప్పారు. భూ సమస్యలు తలెత్తకుండా పరిష్కరించేందుకు సానుకూలంగా ఉంటుందన్నారు. అనంతరం కన్యమడుగు బస్ స్టాప్ లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రజలకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపిటిసి సభ్యులు మహేష్‌లు తెలిపారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, పంచా యతీ కార్యదర్శి సాకేమ్మ, జ్ఞానరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

పులివెందుల రూరల్ : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో కలిసి పని చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి దేరంగుల చంద్రమౌళి సూచించారు. స్థానిక ఎస్‌బిఐ కాలనీలో మంగళవారం వారికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం, నువ్వే జగనన్న కార్యక్రమాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, లక్ష్మీభార్గవి, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, నాయకులు రాజేష్, సంపత్ చందు పాల్గొన్నారు.

14 నుంచి ప్రచార పాదయాత్ర

కడప అర్బన్ : కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేకతను వైఫల్యాలను వివరించడానికి ఈనెల 14 నుండి మే 14 తేదీ వరకు సిపిఐ దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పోరు ప్రచార పాదయాత్ర చేస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఓబులేసు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ జిల్లా సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యవర్గ సభ్యులు పి.కృష్ణమూర్తి, ఎల్. నాగ సుబ్బారెడ్డి, సి. సుబ్రహ్మణ్యం, బషీరునిసా, చంద్రశేఖర్, వెంకట శివ, వేణుగోపాల్, విజయలక్ష్మి, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, బాదుల్లా, గంగా సురేష్, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి వెల్‌నెస్ కేంద్రాల్లో బిపి, షుగర్ పరీక్షలు

అట్లూరు : మండలంలోని ప్రతి వెల్‌నెస్ కేంద్రాల్లో బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ కె. హమీదాబేగం అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ అందరి సమన్వయంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

మళ్లీ వైసిపిదే అధికారం : 'చింతల'

ప్రజాశక్తి-కలకడ

వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపిదే అధికారమని, వై.ఎస్.జగన్ మరోమారు ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ అక్కన్న గారికోట, కె.మాదిగపల్లి, అక్కన్నగారకోట హరిజనవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అన్నింటినీ సఫలీకృతం చేసిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను 95 శాతం పూర్తి చేసి రాష్ట్రంలో గొప్ప పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. గ్రామాల్లో పర్యటిస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్లు ,అమ్మ ఒడి , విద్యాదీవెన, గోరుముద్ద వంటి పథకాలను అమలు చేస్తూ ప్రజలకు చేరు అవుతుంటే ప్రతిపక్షాలు పరిగట్టుకుని విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు అండగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, సింగల్ విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, మోహన్‌రాజానాయుడు, రవికుమార్, తహశీల్దార్ రాము, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, సచివాలయ సిబ్బంది, ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

భూరక్ష సరిహద్దు రాళ్లు ఏర్పాటు

సిఎం జగన్ ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష పథకం ద్వారా సరిహద్దు రాళ్ళను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మంగళవారం మండలంలోని బాట వారిపల్లి పంచాయతీ పోతువారిపల్లి సమీపంలో ఉన్న సర్వేనెంబర్16/5లో జగనన్న శాశ్విత భూహక్కు భూరక్షణ క్రింద సుమారు1520 సరిహద్దురాలను ఏర్పాటు చేయవలసి ఉండగా 207 సరిహద్దురాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ఎజెండాగా మండల సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ధనుంజయులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సమస్యల పరిష్కారమే ఎజెండాగా మండలం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశాన్ని ఎంపిడిఒ శంకరయ్య ప్రారంభించారు. మండల అధ్యక్షులు ఎంపిపి లక్ష్మీ నరసమ్మ, జడ్‌పిటిసి రామచంద్రయ్య యాదవ్, తహసిల్దార్ ధనుంజయులు సభావేదికపై ఆహ్వానించారు. మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నట్లు మండల ఎంపిపి లక్ష్మీనరసమ్మ తెలిపారు. జడ్పిటిసి మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోనూ ఇంజనీర్లు కానీ ఇతర అధికారులు గాని వాలంటీర్లు కానీ పనితీరు సరిగా లేదన్నారు. తాహశీల్దార్ ధనుంజయులు ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా సకాలంలో పనులు చేస్తున్నారని కొనియాడారు. ఎంపిడిఒ శంకరయ్య మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే మండల సర్వసభ వేశానికి వచ్చినప్పుడు ప్రతి శాఖకు చెందిన వారు మూడు రోజులు ముందే నివేదిక సమర్పించాలని తెలిపారు. తహసిల్దార్ ధనుంజయులు మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి నిరుపేద కుటుంబంనికి చెందిన వారికి మొదటి ప్రాధాన్యతగా ప్రభుత్వం రెండు ఎకరాల భూమి మంజూరు చేస్తారని తెలిపారు. ఎంఇఒ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ జిఒ నెంబర్ 2009 ప్రకారం 2023-24 సంవత్సరానికి గాను ప్రతి ప్రయివేట్ పాఠశాలలో 25 శాతం ఉచిత విద్య అందించేందుకు ఆరేళ్ల వయసు ఉన్న పిల్లలు ఒకటో తరగతి విద్యా బోధనకు ఎటువంటి ఫీజులు చెల్లించకుండా ఉచిత విద్య అందించేందుకు కలెక్టర్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అగ్రికల్చర్ ఎఒ మురళీమోహన్, ఉపాధి హామీ అధికారి మంజుల, హౌసింగ్ ఎఇ లావణ్య, ఎంపిటిసిలు సుబ్బయ్య నాయుడు, రామసుబ్బారెడ్డి, సర్పంచులు వేమలేటి కోటిరవి, గుడిపల్లి సర్పంచ్ రఘు, బడికాయలపల్లి సర్పంచ్ ఆదెప్ప గౌడ్. ఎంపిడిఒ ఎఒ థామస్, నగరపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కిరణ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పెద్దతిప్పసముద్రం మండలంలోని కింగ్ కల్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెద్దతిప్ప సముద్రం మండలంలో 1202 డ్వాక్రా గ్రూపులకు రూ.5.85 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. బ్యాంకర్లు ఇచ్చే రుణాలపై వడ్డీశాతం తగించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రముఖ కంపెనీల ఒప్పందాలతో ప్రతి అక్కచెల్లెమ్మలకు వ్యాపార మార్గాలు చూపుతున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళ అభ్యున్నతికి, రక్షణకు, ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, జడ్‌పిటిసి ఉంగరాల శివన్న, ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి, నియోజవర్గం మహిళా కన్వీనర్ అనితచక్రవర్తి, పెద్దతిప్పసముద్రం మాజీ సర్పంచ్ అలీఖాన్ పాల్గొన్నారు.**పీలేరు :** స్థానిక ఎంఎన్ఆర్ గార్డెన్స్ లో మూడో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పొదుపు సంఘాలు దేశంలోనే అగ్ర గామిగా నిలిచాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాలు నిర్వీర్య దశకు చేరుకున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. మహిళ రక్షణకు దిశ యాప్, మహిళల పేరుతోనే ఇళ్ల స్థలాలు, బిల్లులు, పేదరిక నిర్మూలనకు వైఎస్ఆర్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారిత విషయంలో ఇతర రాష్ట్రాలు సైతం ఎపి వైపు చూస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాల అమలు చేయడంలో రాజీ పడడం లేదన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు రూ. 25 వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉండగా ఇప్పటికే రూ. 19 వేల కోట్లు రుణమాఫీ సొమ్ము లబ్దిదారుల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వంలోనే మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. మహిళలు సిఎం జగన్‌ను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సహదేహరెడ్డి, జడ్‌పిటిసి ఎటి రత్నశేఖర్రెడ్డి, సర్పంచులు డాక్టర్ హబీబ్ బాషా, దండు జగన్మోహన్రెడ్డి, హరిణి. జయలక్ష్మీదేవి, జడ్‌ప కో-ఆప్టెడ్ సభ్యుడు ఎస్ఎండి షఫీ, వైస్ ఎంపిపిలు, ఎన్.వి చలపతి, హరిత, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మహితా ఆనంద్, ఉదయకుమార్. వెలుగు ఏరియా కోర్డినేటర్ రూతు, ఎంపిడిఒ మురళీమోహన్ రెడ్డి, ఎపిఎం లక్ష్మణ్ రెడ్డి, ఐకెపి సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వక్ఫ్ బోర్డ్ చైర్మెన్ ఎస్. ఎ.కరీముల్లా తెలిపారు. మంగళవారం పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని ఈస్ట్ పేటలో పరిశుభ్రతకు వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ ఎస్ఎ. కరీముల్లా చర్యలు చేపట్టారు. రోడ్లు శుభ్రం చేయించడం, కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మున్సిపల్ సిబ్బందిచే తొలగిస్తున్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. చెత్తా చెదారం వల్ల ప్రజలు అనారోగ్యభారన పడే అవకాశం ఉందని దీన్ని గమనించి పరిసరాలు పరిశుభ్రం చేయించామని తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం గ్రామంలోని తెలుగు ప్రాథమిక పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 120 మంది విద్యార్థులకు ఆర్ఆర్ స్టోన్ క్రషర్ రాయచోట ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు. విద్యార్థి చదువు మధ్యలో ఆపకుండా కష్టపడి చదవాలన్నారు. భవిష్యత్తులో తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, చంద్రమౌళి భాస్కర్ రెడ్డి, శివారెడ్డి, సుభహాన్, వెంకటరామిరెడ్డి, రఘునాథరెడ్డి, దివ్య కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహం వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపిదిన్నే పంచాయతీ కొత్తపల్లి బస్ స్టాప్ వద్ద వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి దాత పంచలోహ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని వితరణగా ఇచ్చారు. కలకడ మండలం గువ్వలవాండ్లపల్లికు చెందిన శ్రీనివాసరెడ్డి బెంగళూరులో వ్యాపారవేత్తగా స్థిరపడ్డాడు. ఆయన పంచలోహ ఆంజనేయ విగ్రహాన్ని వితరణక ఇచ్చారు.

6,040 మంది వృద్ధులకు పింఛన్లు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో ఈ నెల పెన్షన్ల పంపిణీ రెండు రోజులు ఆలస్యమైనా గ్రామ వాలంటీర్లు సోమ, మంగళవారాల్లో అవ్వ, తాతలకు పెన్షన్ పంపిణీ చేయడంతో వారి లో ఆనందం నెలకొంది. మండలంలో 6040 మంది పెన్షన్లకు రూ. 1,66,54000 విడుదలైంది.గ్రామ వాలంటీర్లు లబ్ధిదారులకు అందజేసినట్లు ఎంపిడిఒ ఆనంద్ కుమార్ తెలిపారు.

ఉచిత సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పీలేరు

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రయివేట్ పాఠశాలలో పేద పిల్లల ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిందని ఎంఇఒ ఎం.బాలాజీనాయక్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో 25 శాతం సీట్ల ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 10వ తేదీతో గడువు ముగియనున్నట్లు చెప్పారు. దరఖాస్తులను cse.ap.gov.in ఏప్రిల్ 7 లోగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మండలంలోని 20 ప్రయివేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో 191 సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధితులకు, వికలాంగులకు 5 శాతం, ఎస్‌సిలకు 10 శాతం, ఎస్‌టిలకు 4 శాతం, బిసి, మైనార్టీ, ఒసిలకు 6 శాతం సీట్లు కేటయించినట్లు తెలిపారు. వివరాలకు ఎంఇఒ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ 8332004595, 9492548810 నెంబర్లలో సంప్రదించాలన్నారు. లేదా తమ గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ను సంప్రదించ వచ్చని ఎంఇఒ తెలిపారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో జరుగుతున్నపదవ తరగతి పరీక్షలను అత్యంత జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అబ్జర్వర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పది పరీక్షలకు సంబంధించిన అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఎంఇఒల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్ గా ప్రకటించడం జరిగిందని పరీక్ష విధులలో పాల్గొనే సిబ్బంది అంతా తమ మొబైల్ ఫోన్లను ఇంటిలోనే ఉంచి రావాలని తెలిపారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో ఏదైనా అక్రమాలు జరిగితే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్, కస్టోడియన్లు, సంబంధిత ఇన్విజిలేటర్ బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

కారు, బస్సు ఢీ : ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

గాయపడిన కారు యజమాని ప్రభాకర్

ఆర్‌టిసి బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. సోమవారం పీలేరు-మదనపల్లి జాతీయ రహదారిలోని వేపులబైలు పంచాయితీ, కంచంవారిపల్లి సమీపంలో జరిగిన ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి నుంచి మదనపల్లి వెళ్తున్న కారు, మదనపల్లి నుంచి పీలేరుకు వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మదనపల్లికి చెందిన కారు యజమాని ప్రభాకర్ (28) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మృతదేహం కోసం గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, ఇన్‌సెట్‌లో సుధాకర్ (ఫైల్‌ఫొటో)

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నీటి కుంటలో ఈత ఆడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..నిమ్మనపల్లి పంచాయతీ పెద్దమాదిగ పల్లెలో నివాసం ఉంటున్న పి. చలమయ్య కుమారుడు పి.సుధాకర (35) పెద్దమాదిగ పల్లెకు సమీపంలోని దామర ఒడ్డులో మంగళవారం మధ్యాహ్నం ఈత ఆడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు చూసి కాపాడడానికి తీవ్రంగా ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. స్థానికులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, వాల్మీకిపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మృతుని స్వస్థలం ఒంగోలు వద్ద దర్శి కాగా, పెద్దమాదిగపల్లికి చెందిన శశికళ అనే మహిళను వివాహం చేసుకొని పది సంవత్సరాలకు పైగా ఇక్కడే నివాసం ఉంటున్నారన్నారు. మృతుడు గతంలో గ్యాస్ గోడౌన్ లో పనిచేసి, ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి ముగ్గురు కుమారుల సంతానం కలదన్నారు. సంఘటన స్థలాన్ని తహశీల్దార్ సిఆర్.మంజుల, పోలీసు హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్, శివ, కేశవ, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాసులు పరిశీలించారు. మృతదేహం వెలికితీయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.

యువకులపై ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పదో తరగతి విద్యార్థినిని ప్రేమపేరిట వేధింపులకు గురి చేసిన ఇద్దరు యువకులపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని యాళగిరివారిపల్లికి చెందిన చెందిన ఓ విద్యార్థిని సోమవారం పదో తరగతి పరీక్ష రాసేందుకు బి.కొత్తకోటకు వచ్చిందని అన్నారు. తిరిగి ఆటోలో ఊరు చేరిన విద్యార్థిని బడికాయలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులతో మాట్లాడేందుకు పాఠశాలకు వెళ్లింది. ఈ సమయంలో పాఠశాల ఎదుట నిల్చున్న నందిష్, నిరంజన్‌లు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురి చేశారని అన్నారు. చేయి పట్టుకుని లాగడంతో అమ్మాయి రోడ్డుపైన పడి గాయాలయ్యాయి. ఈలోగా స్థానికులు రావడంతో ఇద్దరు యువకులు పారిపోయారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఆమె మేనమామ ఫిర్యాదు మేరకు యువకులిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-ములకలచెరువు

పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ట్రాక్టర్

ములకలచెరువు ఎస్ఇబి స్టేషన్ పరిధిలో 2019 నుంచి 2022 సంవత్సరం వరకు వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం మంగళవారం స్థానిక సబ్ స్టేషన్ ఎదురుగా నాటు సారా, మద్యం బాటిళ్లను ఇఎస్ మధుసూదన్, ఎఇ ఎస్ రాధాకృష్ణ, ఎస్ఇబి సిఐ మల్లికా పర్యవేక్షణలో ట్రాక్టర్‌తో తొక్కించి మద్యం సీసాలన్నిటిని ధ్వంసం చేశారు. 86 కేసులలో పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.13 లక్షలు ఉంటుందని ఇఎస్ మధుసూదన్ తెలిపారు.

భవనంపై నుంచి పడి బాలిక మృతి

ప్రజాశక్తి-నందలూరు

ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి చెందిన సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా కు చెందిన ఎం.పద్మావతి బాయి(15) అనే బాలిక రాజంపేట ఉస్మాన్ నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి గత కొద్ది సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికురాలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. గత రెండు రోజులుగా నందలూరు బస్టాండ్ సమీపంలో ఓ భవన నిర్మాణ పనుల కోసం వస్తోంది. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో పనుల కోసం వచ్చిన పద్మావతిబాయి మేస్త్రి తీసుకువచ్చిన టిఫిన్ తిని పేపర్లు మిద్దె పైనుండి కిందకు పడేయ బోయి కళ్ళు తిరిగి ప్రమాదవశాత్తు కింద పడింది. తీవ్ర గాయాలైన పద్మావతిని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోగా మృతి చెందింది. సంఘటన స్థలాన్ని సిఐ పుల్లయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మేస్త్రీ భద్రతా ఏర్పాట్లు ఎక్కడ?

భవన నిర్మాణం జరిగే ప్రాంతంలో మూడో అంతస్తులో కూలి పనిచేసే ప్రాంతంలో ఎటువంటి రక్షణ ఏర్పాట్లు సంబంధిత మేస్త్రీ తిమ్మయ్య తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతురాలు ఆధార్ కార్డులో 06-07-2008 లో జన్మించినట్టు తెలియగా, 15 సంవత్సరాల బాలికను పనులకు ఎలా తీసుకున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఇందిరానగర్ కు చెందిన షేక్ ఫక్రుద్దీన్ అలియాస్ బబ్లూ(38) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లిన బబ్లూతో భార్య గొడవ పడింది. దీంతో మనస్థాపం చెందిన గొంతు కోసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు అతడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అధికార యంత్రాంగం జవాబుదారీగా ఉండాలి

వేంపల్లె : ప్రజాస్వామ్యంలో ప్రజలకు సమాచారం ఇచ్చేందుకు అధికార యంత్రాంగం జవాబుదారీగా ఉండాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఉమ్మడి కడప జిల్లా జాయింట్ సెక్రటరీ రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కర్నూలులో జరిగిన కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా జాయింట్ సెక్రటరీగా తనను ఎన్నుకున్నట్లు చెప్పారు. సిసిఆర్ ఫౌండర్ అనిల్‌కుమార్, ఎపి ఇన్‌ఛార్జి ప్రసాద్, కర్నూలు ఇన్‌ఛార్జి దేవరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు రామచంద్ర పేర్కొన్నారు.